సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 7 । ఆగస్టు । 2023





## సోమశిలలో నీటి నిల్వ

ఆత్మకూరు(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారానికి 23.540 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 533 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది.



## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.61,350 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము) | రూ.5,510 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.5,675 |
| సవర (8 గ్రాములు) | రూ.45,400 |

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.1 /29.2

ఆదివారం గాలిలో తేమ 44 శాతం ఉంది. సోమవారం ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నికలు

నెల్లూరు(పొగతోట): ఖాళీగా ఉన్న రెండు సర్పంచ్‌లు, 63 వార్డు సభ్యులకు ఈ నెల 19వ తేదీన ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. 11వ తేదీ నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ, అవసరమైతే ఈ నెల 19వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించి మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.

### టీడీపీ నేతపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసు

ఇందుకూరుపేట: గిరిజన మహిళపై విచక్షణారహితంగా దాడి చేసి, బంధించి, కులం పేరుతో దూషించిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంపల అనిల్‌కుమార్‌పై అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. గిరిజన మహిళ వెంకటరమణమ్మపై మైపాడుకు చెందిన గంపల అనిల్‌కుమార్ శనివారం రాత్రి దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారం డీఎస్పీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాపూరు మండలం తెగచర్లకు చెందిన యాటగిరి రమణమ్మ–వెంకటేశ్వర్లు దంపతులు మూడేళ్లుగా గంపల అనిల్‌కుమార్ చేపల చెరువు వద్ద కాపలా ఉన్నారన్నారు. అనిల్‌కుమార్ మరొక మహిళతో సన్నిహితంగా ఉన్నాడని రమణమ్మ తన భార్యకు చెప్పిందని ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేసి ఆయన ఇంట్లోనే బంధించాడని తెలిపారు. సమాచారం అందుకొన్న పోలీసులు ఆమె విడిపించి చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. రమణమ్మ మెరుగైన చికిత్స కోసం ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాల నుంచి వెళ్లిపోయిందని, ఆమెను పిలిపించి విచారించారమని తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. వారి వెంట ఎస్సై రాజ్‌కుమార్ ఉన్నారు. కాగా అంతకుముందు తమ నాయకుడిపై కేసు నమోదు చేశారంటూ టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్ద హడావిడి చేశారు. దాడి విషయం నిజమేనని తేలడంతో మిన్నకుండిపోయారు.

### కేంద్రం స్పందించకపోవడం దారుణం



మాట్లాడుతున్న జేవీవీ సత్యనారాయణ

ఆత్మకూరు: మణిపూర్‌లో దారుణ పరిస్థితులు నెలకొన్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని, ఇప్పటికైనా సరైన చర్యలు తీసుకొని రాష్ట్రంలో శాంతి నెలకొనేలా చూడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ అన్నారు. పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు గత మూడు రోజులుగా ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్‌లో జరుగుతున్నాయి. ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ మణిపూర్ ఘటనలను దేశవ్యాప్తంగా అందరు ఖండిస్తున్నా బీజేపీ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా అవిశ్వాస తీర్మాణానికి 107 నిబంధన ప్రకారం నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు తొలుత విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వద్ద నుంచి సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, పి.మాలకొండయ్య, అరిగెర్ల సాయి, ఆత్మకూరు కార్యదర్శి యామాల మధు తదితరులు పాల్గొన్నారు.

### వాహనం ఢీకొని..

గుడ్లూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని జాతీయ రహదారిపై తెట్టు–మోచర్ల గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. తెట్టు పరిసర గ్రామాల్లో మతిస్థిమితం లేని యాచకుడు ఆదివారం తెల్లవారుజామున మోచర్ల వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నుంచి జాతీయ రహదారి దాడుతుండగా ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# అచ్చంగా కోనసీమ

ఎటుచూసినా పచ్చని పంట పొలాలు దర్శనమిచ్చే ఇందుకూరుపేట ప్రాంతాన్ని రైతులు దక్షిణ కోనసీమగా పేర్కొంటున్నారు. సమృద్ధిగా సాగునీరు.. సారవంతమైన భూమి.. అనువైన వాతావరణం పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో రొయ్యలు, చేపల సాగు అధికంగా ఉన్నప్పటికీ కొన్ని గ్రామాల్లో మాత్రం రైతులు కూరగాయలను పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. అంతేకాక పండించిన కూరగాయలను సమీపంలోని నెల్లూరు మార్కెట్‌కు తరలించి తక్కువ ధరకే ప్రజలకు అందిస్తూ ధరల భారాన్ని తగ్గిస్తున్నారు.

- ఎటుచూసినా పచ్చని పంట పొలాలే
- ఇందుకూరుపేట ప్రాంతంలో ఆక్వాసాగుకు భిన్నంగా కూరగాయల సాగు
- నెల్లూరు మార్కెట్‌కు తరలించి లాభాలు ఆర్జిస్తున్న రైతులు
- జిల్లావాసులకు ధరల ఊరట



ఇందుకూరుపేట ప్రాంతంలో సాగులో ఉన్న అరటి, కొబ్బరి తోటలు



చేమ పంట



మిరపతోట



బెండ తోట

ఇందుకూరుపేట: ఇందుకూరుపేట మండలంలో కూరగాయల సాగు సమృద్ధిగా సాగుతోంది. వంగ, బెండ, పచ్చిమిర్చి, చేమ, పసుపు, మొక్కజొన్న, బీర, సొర, అరటి, ఆకుకూరల వంటి వాణిజ్య పంటలను ఈ ప్రాంత రైతులు పండిస్తున్నారు. పచ్చని పొలాలు, కూరగాయల తోటలు, ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండే ఈ ప్రాంతాన్ని రైతులు దక్షిణ కోనసీమగా పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రం నెల్లూరు నగరంలో ఉండే ఏసీ కూరగాయల మార్కెట్‌కు ఇక్కడి నుంచే అధికంగా కూరగాయలు ఎగుమతి అవుతున్నాయి. పంటలు పండించే వారిలో సింహభాగం చిన్న, సన్నకారు రైతులే. నెల్లూరు నగరం అతి సమీపంలో ఉండడంతో రవాణా సౌకర్యం సులువుగా మారింది. కూరగాయలు సాగే చేసే రైతులు లాభాలను ఆర్జించడమే కాక జిల్లావాసులకు తక్కువ ధరలకే కూరగాయలు

| మండలం | రైతులు - సుమారు | ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం - |
|---|---|---|
| ఇందు కూరుపేట | 32 వేల మంది | 4,097 ఎకరాలు |

అందేలా సరఫరా చేస్తున్నారు.

**దిగుబడిలో పైచేయి**

ఇందుకూరుపేట మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో ఎక్కువగా రొయ్యలు, చేపలు విరివిగా సాగు చేస్తుంటారు. అయితే వీటికి భిన్నంగా ఇందుకూరుపేట, జగదేవిపేట, కొత్తూరు, దేవీస్‌పేట, పల్లిపాడు తదితర గ్రామాల్లోని రైతులు కూరగాయలను అధికంగా పండిస్తున్నారు. వీరిలో ఎకరా, రెండెకరాల్లో సాగు చేసే రైతులే అధిక శాతం మంది ఉన్నారు. ఇక్కడి రైతులు తమ అనుభవాలతోపాటు అధికారుల సూచనలను పాటిస్తూ కాలానికి అనుగుణంగా పంటలను మార్పిడి చేస్తూ ముందుకుసాగుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి, తమ అనుకూలతలను దృష్టిలో ఉంచుకొని పంటలు వేస్తూ దిగుబడిలో పైచేయి సాధిస్తున్నారు. దీర్ఘకాలిక పంటల్లో సొర, బీర, అరటి, ఆకుకూరలు వంటి అంతర పంటలతో మంచి లాభాలు పొందుతున్నారు.

### తక్కువ ధరకే కూరగాయలను అందిస్తూ..

పొద్దుపొడవక ముందే కుటుంబ సమేతంగా పొలానికి చేరుకొని తాజా కూరగాయలను పండించడంలో ఇక్కడి రైతులు నిమగ్నమవుతున్నారు. చేతికందిన పంటను కొందరు మార్కెట్‌కు తరలిస్తుండగా, మరికొందరు రోడ్డు పక్కనే విక్రయిస్తుంటారు. ఇంకొందరు దళారులకు పంటను అమ్ముకుంటుంటారు. ఇలా ఎవరి దారిలో వారు పండించిన కూరగాయలను విక్రయిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. సుమారు 7 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో నెల్లూరు మార్కెట్ ఉండడంతో రవాణాకు కూడా అనువుగా ఉంటోంది. పండించిన పంటను నేరుగా వాహనాల ద్వారా మార్కెట్‌కు తరలిస్తారు. పంటను బట్టి మార్కెట్‌కు సాయంత్రం సమయంలో వెళ్లాలా.. అర్ధరాత్రి 2 గంటలకు బయలుదేరి వెళ్లాలా అని రైతులు నిర్ణయించుకుంటారు. ఆ సమయంలో మార్కెట్‌కు చేర్చడం ద్వారా వేకువజాము నుంచే కొనుగోలుదారులకు కూరగాయలను అందుబాటులో ఉంచుతున్నారు. కూరగాయల రేట్లు అధికంగా ఉన్న సమయంలో సైతం జిల్లావాసులకు తక్కువ ధరకే కూరగాయలను అందిస్తున్న ధరల భారాన్ని సైతం తగ్గిస్తున్నారు.

### పది ఎకరాల్లో కూరగాయల సాగు



నేను 10 ఎకరాల్లో కూరగాయల సాగు చేస్తున్నాను. పండిన పంటను నేరుగా నెల్లూరు ఏసీ మార్కెట్‌కు తరలించి విక్రయించుకుంటాను. ప్రస్తుతం పంటల సాగుకు అనువైన సమయం కావడంతో వంగ, బెండ, బీర, మిరప సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా.

– తన్నీరు వెంకయ్య, దేవిస్‌పేట

### ఆకుకూరలు వేశా



నాకు అరెకరా సొంత పొలం ఉంది. మరో అరెకరా పొలం కౌలుకు తీసుకొని గోంగూరు, ఆకుకూరలు సాగు చేస్తున్నాను. నాకు తెలిసినప్పటి నుంచి కూరగాయలు పండిస్తున్నాం. కుటుంబం అంతా కలిసి పొలం పనులు చేస్తాం. పండించిన ఆకుకూరలను ఇక్కడే అమ్మడం లేదా నెల్లూరు మార్కెట్‌కు తీసుకెళ్లడం చేస్తుంటాం.

– అత్తిపాటి శరత్, కొత్తూరు

### చేమ, మొక్కజొన్న, బెండ వేశా



నాకు తెలిసినప్పటి నుంచి కూరగాయలు సాగు చేస్తున్నాం. ప్రస్తుతం చేమ, బెండ, మొక్కజొన్న సాగు చేశాం. వాతావరణానికి అనుగుణంగా పంట మార్పిడి చేపడతాం. పండిన పంటను ఎప్పటికప్పుడు నెల్లూరు మార్కెట్‌కు తరలించి విక్రయించుకుంటాం.

– నిలిపూడి మాధవయ్య, దేవిస్‌పేట

## పులివెందులను టచ్ చేయాలనుకోవడం భ్రమ

- నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్



45వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రతిపక్షనేత చంద్రబాబు పులివెందుల, మరో నియోజకవర్గంలో తాము గెలవబోతున్నామంటూ నెల్లూరులో మాట్లాడారని, ఆయన ముందు కుప్పంలో గెలుస్తారో లేదో చూసుకోవాలని, పులివెందులను టచ్ చేయాలనుకోవడం చంద్రబాబు భ్రమ అని, అలాంటి కలలు మానుకోవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ రామమూర్తినగర్, కర్నాలమిట్ట, గచ్చుకాలువ, శ్రీనివాస అగ్రహారం తదితర ప్రాంతాల్లో ఆదివారం ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలు అందని వారికి ఎందుకు అందలేదో పరిశీలించి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

**సంక్షేమ పాలన చూసి ఓర్వలేక..**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే అన్నారు. చంద్రబాబు ఎవరితో పొత్తులు పెట్టుకున్నా, తన కుమారుడు లోకేశ్ సాయంత్రం సమయాల్లో పాదయాత్ర చేసినా అధికారంలోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. చంద్రబాబు ఇరిగేషన్ ప్రాజెక్ట్ తదితర అంశాలపై సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను, కార్యకర్తలను రెచ్చగొడుతున్నారన్నారు. ఎవరిమీదైతే ఎక్కువ కేసులు ఉండి, రౌడీ షీట్లు ఉంటాయో వారికి టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నామినేటెడ్ పదవులు ఇస్తామని చంద్రబాబు చెప్తున్నారంటే అంతకన్నా హేయమైన చర్య మరొకటి ఉండదన్నారు. పోలీసులను రెచ్చగొట్టి వారి వాహనాలపై దాడిచేయడం పుంగనూరులో అందరూ చూశారన్నారు. ఆ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై రుద్ది శాంతిభద్రతలు క్షీణించాయని ప్రజల్లో అపోహలు సృష్టించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేశ్, దత్తపుత్రుడు అందరూ కలిసికట్టుగా వచ్చినా, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా జగనన్నను ఏమీ చేయలేరన్నారు. చంద్రబాబు ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేరన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్ ముదిరెడ్డి వేదవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- పెద్ద సంఖ్యలో యువత పార్టీలో చేరిక
- ముత్తుకూరులో భారీ బహిరంగ సభ, ర్యాలీ



బహిరంగసభలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: రాష్ట్రంలో 2024లో జరిగే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీనే విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, సర్వేపల్లిలో పార్టీ జెండా రెపరెపలాడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరులో ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి కాకాణి యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయం నుంచి మార్కెట్ కూడలి వరకు యువకుల భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం ఈ రాష్ట్రానికి చాలా అవసరమన్నారు.

**టీడీపీకి డిపాజిట్ కూడా రాదు**

రాబోయే ఎన్నికల్లో సర్వేపల్లిలో టీడీపీకి డిపాజిట్ కూడా రాదని మంత్రి అన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్ష నేత చంద్రబాబు సంయమనం కోల్పోయి వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరి అనే పేరును సరిగ్గా ఉచ్చరించలేని, జయంతి–వర్ధంతికి తేడా తెలియని ఆయన తనయుడు లోకేశ్‌ను ముత్తుకూరుకు తీసుకువచ్చిన సోమిరెడ్డి తనపై విమర్శలు చేయించారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము ఎంతో హుందాగా వ్యవహరించామన్నారు. ప్రస్తుతం సోమిరెడ్డిని చూసి జాలి, బాధ కలుగుతోందన్నారు. ఒకరిద్దరిని చూపించి పార్టీలో చేరారంటూ ప్రచారం చేసుకొంటున్నారని ఎద్దేవా చేశారు.

**పార్టీలో 500 కుటుంబాల చేరిక**

ఈ సభలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 500 మంది యువకులు వినయ్, వాసు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ 500 మంది పార్టీలో చేరడం అంటే మండలంలో 5,000 కుటుంబాలు ఒకే రోజు పార్టీలో చేరినట్టేనని అన్నారు. కష్టపడి పనిచేయడం, పది ఓట్లు వేయించడంలో ఉన్న ఆసక్తి, తపన కలిగిన యువకులు పార్టీలో చేరడం తన అదృష్టమన్నారు. సర్వేపల్లి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వేపల్లి ప్రజల ఆశీస్సులే తనకు ముఖ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బండెల వెంకటరమణయ్య, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, కె.లక్ష్మణరెడ్డి, మునుకూరు జనార్దన్‌రెడ్డి, శివారెడ్డి రామమోహన్‌రెడ్డి, దువ్వూరు సుబ్బరామిరెడ్డి, కోదండరామరెడ్డి, నడవడి ముత్యంగౌడ్, పోలిరెడ్డి చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉలిక్కిపడ్డ కొండబిట్రగుంట

## ఒకే కుటుంబంలో ముగ్గురి దారుణ హత్య

- కుటుంబ కలహాల నేపథ్యంలో దారుణం



ఒకే గదిలో మౌనిక, ఆమె అమ్మమ్మ శాంతమ్మ మృతదేహాలు

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంటలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఒకే ఇంట్లో ముగ్గురు కుటుంబసభ్యులను దారుణంగా హతమార్చిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. గుండెపోటుతో మృతిచెందిన కుమారుడి చావుకు కోడలే కారణమనే అనుమానం, ఆవేశంతోపాటు పాతగొడవల నేపథ్యంలో విచక్షణ కోల్పోయిన కుటుంబసభ్యులు కోడలిపైన, ఆమె తండ్రి, అమ్మమ్మలపై ఆదివారం వేకువజామున దాడికి తెగబడి హతమార్చిన ఘటన గ్రామస్తులను ఉలిక్కిపడేలా చేసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు కొండబిట్రగుంటకు చెందిన రైల్వే ఉద్యోగి మందాటి మధుసూదన్‌కు, బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన మౌనికకు(32) తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఎనిమిదేళ్ల వయసున్న కుమారుడు మన్విత్ ఉన్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో నాలుగేళ్ల నుంచి భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. మధుసూదన్ బిట్రగుంట రైల్వే స్టేషన్ టెలికాం విభాగంలో పనిచేస్తూ కొండబిట్రగుంటలో తల్లిదండ్రులతో కలిసి ఉంటుండగా, మౌనిక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ బెంగళూరులో ఉంటున్నారు. వీరి కుమారుడు మన్విత్ బుచ్చిరెడ్డిపాళెంలోని అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం మధుసూదన్(35) గుండెపోటుతో మృతిచెందగా మౌనిక తన తండ్రి కృష్ణయ్య, అమ్మమ్మ శాంతమ్మ, కుమారుడు మన్విత్‌తో కొండబిట్రగుంటకు వచ్చి అక్కడే ఉంటున్నారు. ఈక్రమంలో ఏం జరిగిందో ఏమో కానీ ఆదివారం వేకువజామున మౌనిక(32), ఆమె తండ్రి కృష్ణయ్య(65), అమ్మమ్మ శాంతమ్మ(75) ఇంట్లోనే దారుణహత్యకు గురయ్యారు. మౌనిక అత్త, మామ, మరిది ఇంటికి తాళాలు వేసి మన్విత్‌ను తీసుకుని పరారయ్యారు. ఆదివారం ఉదయం బుచ్చిరెడ్డిపాళెం నుంచి మౌనిక తల్లి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ఎవరూ ఫోన్ తీయకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని పరిశీలించగా మౌనిక, ఆమె తండ్రి, అమ్మమ్మ మృతదేహాలు రక్తపు మడుగుల్లో పడి ఉన్నాయి. మౌనిక మామ(మధుసూదన్ తండ్రి) మాల్యాద్రి, మరిది చంద్రమౌళి, అత్త ధనమ్మ కనిపించకపోవడంతో వారే ఈ హత్యలు చేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆధారాలు సేకరిస్తున్నాయి. మరోవైపు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా మౌనిక అత్త ధనమ్మను గ్రామంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిసింది.



కృష్ణయ్య (ఫైల్).



మౌనిక (ఫైల్)



శాంతమ్మ (ఫైల్)

**పూర్తిస్థాయి విచారణ**

ఒకే ఇంట్లో మూడు హత్యలపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. హత్యలకు కారణాలతోపాటు బయటి వ్యక్తులు ఎవరైనా సహకరించారా, హత్యల అనంతరం నిందితులు ఎక్కడికి పారిపోయారు, మౌనిక కుమారుడు మన్విత్ ఎక్కడ ఉన్నాడు, ఒకే ఇంట్లో మూడు హత్యలు జరిగినా చుట్టుపక్కల వాళ్లకు అనుమానం రాకపోవడం, ఎలాంటి అరుపులు వినిపించకపోవడం తదితర అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. అలాగే క్లూస్ టీం సాయంతో సాక్ష్యాధారాలు కూడా పక్కాగా సేకరిస్తున్నారు.



గుండెలవిసేలా రోదిస్తున్న మౌనిక తల్లి

**చిదిమేసిన మనస్పర్థలు**

చిన్నచిన్న మనస్పర్థలు, మాట పట్టింపులు రెండు కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపాయి. మనుషుల మధ్య బంధాలు సన్నగిల్లడం, తమ మాటే నెగ్గాలనే పట్టుదలే కొండబిట్రగుంటలో జరిగిన హత్యలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. మందాటి మధుసూదన్ – మౌనిక దంపతులు అన్యోన్యంగానే ఉండేవారని అని తెలిసింది. మధుసూదన్ ఫేస్‌బుక్ పేజీలో కూడా భార్య, కుమారుడితో దిగిన ఫొటోలే ఎక్కువగా ఉన్నాయి. చిన్నచిన్న మనస్పర్థలతో మౌనిక వేరే కాపురం పెడదామని అడగడం, మధుసూదన్ అందుకు అంగీకరించకపోవడంతో నాలుగేళ్లుగా వారు విడిగా ఉంటున్నారు. ఈక్రమంలోనే తరచూ మానసిక ఒత్తిడికి గురవుతున్న మధుసూదన్ పది రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మౌనిక కొండబిట్రగుంటకు రాగా, ఆమెకు తోడుగా తండ్రి, అమ్మమ్మ కూడా వచ్చారు. కుమారుడిని కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు క్షణికావేశంలోనో, కుమారుడి ఉద్యోగం, ఆస్తి కోడలికి దక్కకూడదనే ఉద్దేశంతోనే కోడలిని, ఆమె తండ్రిని, అమ్మమ్మని కూడా హతమార్చారు. కూతురిని, భర్తను, అమ్మను ఒకేసారి కోల్పోయిన మౌనిక తల్లి ఘటనా స్థలంలో కుప్పకూలిపోయింది. ఈమెను ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు.

## క్లుప్తంగా

### పెన్నానదిలో విద్యార్థి గల్లంతు

- పోలీసుల ముమ్మర గాలింపు


గల్లంతైన మనోజ్ కుమార్ (ఫైల్)

సంగం : మండలంలోని కోలగట్ల గ్రామ సమీపంలోని పెన్నానదిలో ఆదివారం ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. పోలీసులు వివరాల మేరకు.. సంగం రాళ్లచెలికకు చెందిన రామకృష్ణయ్య, తిరుపతమ్మ దంపతుల కుమారుడు మనోజ్‌కుమార్ (17) స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి ఆదివారం కోలగట్ల గ్రామంలో నాగార్పమ్మ తల్లి ఆలయానికి కుటుంబ సమేతంగా వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం పూజలు నిర్వహించిన అనంతరం మనోజ్‌కుమార్ పెన్నానదిలో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. దీనిని గమనించిన కొందరు కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు సైతం కొంతసేపు గాలింపు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఈతగాళ్లతో పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. రాత్రి కావడంతో గాలింపు నిలిపివేశారు. సోమవారం ఉదయం గాలింపు చేపడుతామని పోలీసులు తెలిపారు.

### చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి


కిష్టయ్య (ఫైల్)

అల్లూరు : మండలంలోని వడ్డిపాళెం సమీపంలో ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి గల్లంతై మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అల్లూరు చవటపాళెం కాలనీకి చెందిన ఆవల కిష్టయ్య(55) కూలి పనులు సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన దేవరకొండ శివయ్యతో కలిసి ఆదివారం ఉదయం చేపల కోసం తెప్ప సాయంతో చెరువులో దిగాడు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణ సమయంలో ప్రమాదవశాత్తు కిష్టయ్య చెరువులో పడి గల్లంతయ్యాడు. ఆయన్ను కాపాడేందుకు శివయ్య ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకుండాపోయింది. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. ఎస్సై శ్రీనివాసులురెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

### ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న లారీ

- పశ్చిమ బెంగాల్‌కు చెందిన నలుగురికి తీవ్రగాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప సమీపంలో ఆదివారం ఆగి ఉన్న మారుతీ ఓమ్నీ వ్యాన్‌ను వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పశ్చిమబెంగాల్‌లోని బైతిగచ్చా గ్రామానికి చెందిన రమిత్ మండల్, నోబో బిస్వాస్, దినేష్ మండల్, ఆకాష్ మండల్, జుకీ బిస్వాస్, రాజు మండల్, బాపన్ మండల్ బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో హౌస్‌కీపింగ్ విభాగంలో పనిచేసేందుకు పశ్చిమబెంగాల్ నుంచి బెంగళూరుకు మారుతీ ఓమ్నీ వ్యాన్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో కప్పరాళ్లతిప్ప సమీపంలోకి వచ్చేసరికి టైర్ పంక్చర్ కావడంతో వ్యాన్‌ను రోడ్డు పక్కన నిలిపి టైర్ మార్చేందుకు ప్రయత్నిస్తుండగా కావలి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ మితిమీరిన వేగంతో వస్తూ అదుపుతప్పి ఆగి ఉన్న మారుతీ వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో టైర్ మారుస్తున్న నోబో బిస్వాస్, ఆకాష్ మండల్, దినేష్ మండల్, జుకీ బిస్వాస్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం వెంటనే 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### శ్లాబ్ కూలి ఒకరి మృతి

- ఆరుగురికి గాయాలు

నెల్లూరు రూరల్ : రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురం సమీపంలో ఓ ప్రైవేటు కళాశాల భవనానికి సంబంధించి శ్లాబ్ పనులు జరుగుతుండగా ఒక్కసారిగా కూలడంతో ఒకరు మరణించగా ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. నెల్లూరు రూరల్ మండలం సజ్జాపురానికి చెందిన అప్పకూటి సురేష్ (32) గత కొంత కాలంగా ఇక్కడి కళాశాల భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ సూపర్‌వైజర్‌గా ఉన్నారు. శ్లాబ్ పనులు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా కూలడంతో అక్కడే ఉన్న సురేష్‌తో పాటు మరో ఆరుగురు కూలీలకు గాయాలయ్యాయి. వీరిని నగరంలోని అపోలో ఆస్పత్రికి తరలించగా సురేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి జీజీహెచ్‌కు తరలించారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 119 |
| లేయర్ (లైవ్) | : 88 |
| బ్రాయిలర్ చికెన్ | : 210 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 232 |
| లేయర్ చికెన్ | : 150 |

# ప్రకృతి సాగు.. బహు బాగు

- జిల్లాలో పెరుగుతున్న సేంద్రియ సాగు
- ఖర్చు తగ్గుతుండడంతో రైతుల ఆసక్తి


సేంద్రియ సాగును పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(సెంట్రల్) : మారుతున్న కాలానికి తగ్గట్లుగా రైతులు ప్రకృతి సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో కొందరు రైతులు ఈ సాగు చేసేవారు. ప్రస్తుతం వీరి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రధానంగా రసాయనాలు వాడే ఆహారానికి చాలా మంది స్వస్తి చెబుతున్నారు. కరోనా నుంచి ఎక్కువగా సేంద్రియ ఆహారాన్ని తీసుకోవడం అలవాటు చేసుకుంటున్నారు. అటు ప్రభుత్వం కూడా వీటిని ప్రోత్సహిస్తుండడంతో చాలా వరకు రైతులు ప్రకృతి సాగువైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా సేంద్రియ సాగు జరుగుతోంది.

**ఖర్చు చాలా తక్కువే..**

సాధారణంగా వివిధ రకాల సాగుకు సంబంధించి ఏడాదికి దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల రసాయనాలు వాడుతుంటారని అధికారులు అంచనా వేశారు. ఎక్కువగా వరి సాగులోనే అధికంగా రసాయనాల వాడకం ఉంటోంది. దీనివల్ల వరిసాగులో ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకు ఖర్చవుతోంది. కానీ ప్రకృతి వ్యవసాయంలో మాత్రం ఎకరాకు రూ.16 వేల నుంచి రూ.18 వేల వరకు ఖర్చవుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. దిగుబడి విషయంలో మొదటి సంవత్సరం కొంత మేర తగ్గినా, రెండో ఏడాది నుంచి ఎక్కువ దిగుబడి వస్తుంటుంది.

**ప్రత్యేక గౌరవ వేతనం**

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేసే అనుభవం ఉన్న కొందరు రైతులను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. 387 మంది రైతులు వివిధ కేటగిరీలుగా అవగాహన కల్పిస్తుంటారు. కేటగిరీల వారీగా రూ.6 వేల నుంచి రూ.39,600 వరకు గౌతర వేతనంగా ప్రభుత్వం ఇస్తోంది. వీరిలోని కొంత మందికి సహాయకులుగా ఉండేందుకు వివిధ మహిళా సంఘాల నుంచి 124 మంది ఎంపిక చేశారు. వీరికి రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం ఇస్తుంటారు. ప్రధానంగా కిచెన్ గార్డెన్స్‌పై అవగాహన కల్పిస్తుంటారు.

**ఆయా ప్రాంతాల్లోనే ఎక్కువ**

ప్రకృతి వ్యవసాయం ఇప్పుడిప్పుడే జిల్లా మొత్తం వ్యాపిస్తోంది. ప్రస్తుతం నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట, కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి, వింజమూరు, పొదలకూరు, కావలి, కందుకూరుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఈ వ్యవసాయం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కాగా ప్రస్తుతం జిల్లాలోని పలుచోట్ల ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.

**ప్రోత్సహిస్తున్నాం**



జిల్లాలో ప్రకృతి సాగు బాగుంది. అన్ని ప్రాంతాల్లో ఈ సాగు జరగాలనే ఉద్దేశంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి సాగుపై ఎటువంటి సందేహాలు ఉన్నా తమ సిబ్బంది పూర్తి వివరాలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. గ్రామాల్లోని ఆర్బీకేల్లో కూడా ఈ సాగుపై ప్రత్యేకంగా అవగాహన కల్పించేందుకు పోస్టర్లు వేశాం.

– మాలకొండయ్య, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్

**ఆదరణ బాగుంది**



తాను ఎనిమిది ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నా. ప్రభుత్వం నుంచి ఆదరణ కూడా బాగుంది. పెట్టుబడి తక్కువగా ఉండి, రాబడి బాగుంటోంది. రానున్న రోజుల్లో మరింత విస్తీర్ణంలో సాగు చేసే యోచనలో ఉన్నా.

– యు.నరసింహులు, కరటంపాడు, రైతు

**40 వేల ఎకరాల్లో..**

జిల్లాలో ప్రతి ఏడాది ప్రకృతి వ్యవసాయం పెరుగుతూ ఉంది. ప్రధానంగా 2019 నుంచి సేంద్రియ సాగు చేసే రైతుల సంఖ్య పెరగడంతో పాటు, విస్తీర్ణం కూడా పెరుగుతోంది. 2017–18 మధ్య కాలంలో జిల్లాలో 18 వేల నుంచి 21 వేల ఎకరాల్లో 17 వేల నుంచి 20 వేల మంది రైతులు సేంద్రియ సాగు చేసేవారు. 2019–23 మధ్య కాలంలో 40 వేల ఎకరాల్లో 37 వేల మంది రైతులు సాగు చేస్తుండడం గమనార్హం. అటు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహంతో పాటు, ఇటు వినియోగం కూడా ఎక్కువగా ఉండడంతో అధిక సంఖ్యలో రైతులు ముందుకు వస్తున్నారు.



### బైక్‌ను ఢీకొన్న లారీ

- భార్య దుర్మరణం, భర్తకు గాయాలు


ఘటనా స్థలంలో కుసుమ మృతదేహం


కుసుమ (ఫైల్)

మనుబోలు : మోటార్‌బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతిచెందగా భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మనుబోలు మండల పరిధిలోని జాతీయ రహదారిపై కృష్ణపట్నం పోర్టు క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సైదాపురం మండలం కొమ్మిపాడు గ్రామానికి చెందిన గంగిరెడ్డి–కుసుమ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వీరు నెల్లూరులోని వసతిగృహంలో ఉండి చదువుకుంటున్నారు. ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు దంపతులు బైక్‌పై నెల్లూరుకు బయలుదేరారు. పోర్టు క్రాస్‌రోడ్డు వద్ద నెల్లూరు వైపు వెళ్తున్న ఓ లారీ ముందు వెళ్తున్న మరో లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో వీరి బైక్‌ను వెనుక వైపు ఢీకొంది. దీంతో భార్య కుసుమ(40) అక్కడికక్కడే మృతిచెందగా భర్త గంగిరెడ్డి రోడ్డు పక్కగా దూరంగా పడిపోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై అజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంచీపురం నారాయణి సిల్క్స్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నటి ప్రగ్యా జైస్వాల్

- సందడి చేసిన ప్రగ్యా జైస్వాల్

నెల్లూరు(బృందావనం) : నగరంలోని మాగుంట లేఅవుట్‌లో బెజవాడ గోపాల్‌రెడ్డి సర్కిల్ వద్ద కాంచీపురం నారాయణి సిల్క్స్ షోరూమ్‌ను సినీనటి ప్రగ్యా జైస్వాల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరుకు తొలిసారిగా వచ్చిన తాను కాంచీపురం నారాయణి సిల్క్స్‌కు చెందిన ఏడో షోరూమ్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రత్యేక డిజైన్ల పట్టుచీరలకు కాంచీపురం నారాయణిసిల్క్స్ కొలువన్నారు. కాంచీపురం నారాయణి సిల్క్స్ డైరెక్టర్ పీవీఎస్ అభినయ్ మాట్లాడుతూ తమ షోరూమ్‌లోని ప్రతి చీర కస్టమర్ల అభిరూచికి తగ్గట్లు ఉంటాయన్నారు. తమ డైరెక్టర్లు సురేష్ శీర్ల, టి.కేశవ్‌గుప్తా, టి.రాకేష్ బృందం విస్తృత స్థాయిలో అధ్యయనం చేసి ప్రత్యేకమైన పట్టుచీరలను తీసుకొస్తారన్నారు. కంచిపట్టు, ధర్మవరం, ఆరణి, గద్వాల్, కోట, పోచంపల్లి వెరైటీలు మొదలుకొని దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత కళాకారుల పనితనం, నైపుణ్యాలు మా షోరూమ్‌లో దర్శనమిస్తాయన్నారు. అన్నిరకాల సీజన్లకు సరిపోయే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు సొంతం చేసుకోవాలన్నారు.

### గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య

మనుబోలు : మానసిక స్థితి సరిగ్గా లేని ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని జట్లకొండూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంతోష్(18)కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో అత్త వద్ద ఉండేవాడు. అయితే ఆమె కూడా చనిపోవడంతో పెదనాన్న సంతోష్ బాగోగులు చూసుకుంటున్నాడు. కాగా సంతోష్ మానసిక స్థితి సక్రమంగా ఉండేది కాదు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు చికిత్స నిమిత్తం చెన్నై తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

# ఆర్యవైశ్యుల ద్రోహి చంద్రబాబు


మాట్లాడుతున్న కుప్పం ప్రసాద్, పక్కన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

కావలి: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ద్రోహి చంద్రబాబు అని, ఆయన పట్ల అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ అన్నారు. వైఎస్సార్‌సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకుడిగా కుప్పం ప్రసాద్ నియమితులైన నేపథ్యంలో ఆయన కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి నివాసంలో ఆదివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు ఏమి చెప్పినా ప్రజలు నమ్మరనే విషయాన్ని గుర్తించి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. 'నాది రాయలసీమే, నాకూ ఫ్యాక్షన్ తెలుసు, నాకు చంపడం తెలుసు' అంటూ చంద్రబాబు తన క్రూరమైన వైఖరిని బహిర్గతంగా చెప్పారన్నారు. ఆర్యవైశ్యులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో టీటీడీ బోర్డులో ఎప్పుడు ఆర్యవైశ్యులు సభ్యులుగా లేరని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెండు సార్లు ఇద్దరు చొప్పున నలుగురు సాధారణ ఆర్యవైశ్యులను సభ్యులుగా నియమించారని గుర్తుచేశారు. నెల్లూరు, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్లు, కాణిపాకం నుంచి సింహాచలం దేవస్థానం చైర్మన్లు, డైరెక్టర్ల వరకు ఆర్యవైశ్యులను నియమించారన్నారు. దివంగత వైఎస్సార్ నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు జిల్లాగా పేరు పెట్టారని, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాలను ఆర్యవైశ్యులు చందాలతో నిర్మించారని వాటిని, దేవదాయశాఖ నుంచి మినహాయించి, ఆర్యవైశ్యులే కమిటీలు ఏర్పాటు చేసుకునేలా చేశారన్నారు. దివంగత సీఎం, గవర్నర్ కొణిజేటి రోశయ్య మీద ఉన్న కోపంతో చంద్రబాబు ఆర్యవైశ్యులకు ఏమీ చేయలేదన్నారు.

# గంపెడాశలు అడియాశలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- ఫ్రెండ్‌షిప్ డేన స్నేహితులతో వెళ్లి తిరిగిరాని లోకాలకు..


మృతుడు బి.సుమంత్ (ఫైల్)

ఆత్మకూరు(సోమశిల) : వారందరూ మంచి స్నేహితులు. ఆటవిడుపుగా పెంచలకోనకు వెళ్లి అటవీ ప్రాంతంలో ఫొటోషూట్ చేద్దామని ఆరుగురు యువకులు మూడు బైక్‌లపై బయలుదేరారు. కాగా సుమంత్(23), పవన్ ఓ బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుమంత్ దుర్మరణం చెందగా, పవన్ గాయపడ్డారు. ఈ ఘటన అనంతసాగరం సమీపంలో చెరువుకట్టపై ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి వివరాల మేరకు.. ఆత్మకూరు పట్టణానికి చెందిన బచ్చు సుధాకర్, కుమారి దంపతలకు సుమంత్, సాత్విక సంతానం. సుధాకర్ ఫ్యాన్సీ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా సుమంత్ (23), పి.పవన్ ఇద్దరు మంచి స్నేహితులు. వీరు మరో నలుగురితో కలిసి మూడు మోటారు బైక్‌ల్లో పెంచలకోనకు బయలుదేరారు. ఈ క్రమంలో మండల కేంద్రమైన అనంతసాగరం దాటిన తరువాత చెరువుకట్ట మలుపు వద్ద సోమశిల నుంచి ఆత్మకూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ వేగంగా ఒకదానినొకటి ఢీకొన్నాయి. దీంతో తలకు తీవ్రగాయమైన సుమంత్ రోడ్డు పక్కన పడిపోగా, పవన్ మరో పక్క పడిపోయాడు. కొద్దిసేపటికే సుమంత్ మృతిచెందాడు. ఎస్సై తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన పవన్‌ను ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కరీమున్నీసా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

**నేత్రదానం**

కుమారుడు మృత్యువాత పడినా ఉదార హృదయంతో అతని నేత్రాలను దానం చేసి తండ్రి పెద్ద మనస్సు చాటుకున్నారు. సుమంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ నెల్లూరు వారు ఏసీఎస్సార్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు బాలాజీ సింగ్, లయన్స్‌క్లబ్ వారు కలిసి కోరడంతో సుధాకర్ తన కుమారుడి నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో నెల్లూరుకు చెందిన వైద్యురాలు శర్వాణి కార్నియాలను (నేత్రలను) నెల్లూరుకు తరలించారు.

**వారంలో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా..**

ఇంటికి ఏకైక కుమారుడైన సుమంత్ బీటెక్ పూర్తిచేశారు. ఇటీవలే బెంగళూరుకు చెందిన ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఎంపికయ్యారు. మరో వారం రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఈ క్రమంలో స్నేహితులతో సరదాగా గడిపేందుకు వెళ్లి మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబాన్ని పోషిస్తాడనుకున్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు.